




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/


గురువారం 5-6-2025

సంపుటి: 21 సంచిక: 62
పేజీలు: 8 వెల: రూ.1


- 'వెన్నుపోటు'లో కనిపించని చిన్ని
- ఏడాదిగా జనాల్లోకి రాని ధర్మాన తనయుడు
- సక్సెస్ అయ్యాక స్టేట్‌మెంట్లు, డైవర్షన్ పాలిటిక్స్
- అభద్రతా భావంతో వెనుకబడిపోతున్న యువనాయకుడు

# ఇంకెప్పుడు నాయకుడివవుతావ్!




- తండ్రి మంత్రిగా ఉన్నప్పుడో, లేదా తండ్రి ఉన్న పార్టీ అధికారంలో ఉన్నప్పుడో అన్నీ తానేనని ప్రకటించుకోడానికో, లేదా నిరూపించుకోడానికో నిత్యం పరామర్శలు, పలకరింపులు, పల్లెనిద్రలు పేరుతో మీడియాలో కనిపించిన ధర్మాన తనయుడు రామ్‌మనోహర్ నాయుడు బుధవారం జరిగిన వెన్నుపోటు కార్యక్రమంలో ఎక్కడ? అనే ప్రశ్న తలెత్తితే ఏం చెబుతారు? 'వెన్నుపోటు'కే వెన్నుపోటు పొడిచారా? దీనికి సమాధానం ఎవరు చెబుతారు?
- తన కొడుకు కృష్ణచైతన్యకు టిక్కెటివ్వాలని దాస్ ఓపెన్‌గానే అడుగుతున్నారంటే అందుకు కారణం కృష్ణచైతన్య యాక్టివిటీనే. ధర్మాన ప్రసాదరావుకు ఆయన కుమారుడు కూడా ఎమ్మెల్యే కావాలని కోరిక ఉన్నా బహిరంగంగా ప్రకటించకపోవడానికి కారణం చిన్నీ అధికారంలో లేనప్పుడు ఇనాక్టివ్‌గా స్టేట్‌మెంట్లకు పరిమితం కావడమే. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ధర్మాన ప్రసాదరావు చేతిలో జిల్లాను పెడితే జగన్మోహన్‌రెడ్డిని ఒప్పించి టిక్కెట్ అడిగితే రామ్‌మనోహర్ నాయుడు ఏం చేశాడన్న ప్రశ్న తలెత్తితే ఏం చెప్పాలి?

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**"నాన్నగారు ధర్మాన ప్రసాదరావు పిలుపు మేరకు వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు నా ధన్యవాదాలు"**

.. ఇది ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు సన్నాఫ్ ధర్మాన ప్రసాదరావు బుధవారం సాయంత్రం సామాజిక మాధ్యమాల్లో పెట్టిన సందేశం. నిజమే.. వెన్నుపోటు కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది. ఇన్నాళ్లూ ఆరోగ్యం బాగులేదనో, మరో కారణంతోనో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు 'వెన్నుపోటు' విజయవంతానికి తెర వెనుక కృషి చేశారు. తన నియోజకవర్గంలో రెండు మండలాలు, నగరంలో ఉన్న కేడర్‌తో సమావేశాలు నిర్వహించి వెన్నుపోటును ఎందుకు విజయవంతం చేయాలో దిశానిర్దేశం చేశారు. ఇది కాదనలేని సత్యం. ఆ మాటకొస్తే వైకాపానే ఈ కార్యక్రమాన్ని చాలా ప్రతిష్ఠగా తీసుకుంది. బహుశా ధర్మాన ప్రసాదరావు కూడా అందుకే ఏడాది తర్వాత తొలిసారిగా యాక్టివేట్ అయ్యారు. ఇవన్నీ బాగానే ఉన్నాయి. తండ్రి మంత్రిగా ఉన్నప్పుడో, లేదా తండ్రి ఉన్న పార్టీ అధికారంలో ఉన్నప్పుడో అన్నీ తానేనని ప్రకటించుకోడానికో, లేదా నిరూపించుకోడానికో నిత్యం పరామర్శలు, పలకరింపులు, పల్లెనిద్రలు పేరుతో మీడియాలో కనిపించిన ధర్మాన తనయుడు రామ్‌మనోహర్ నాయుడు బుధవారం జరిగిన వెన్నుపోటు కార్యక్రమంలో ఎక్కడ? అనే ప్రశ్న తలెత్తితే ఏం చెబుతారు? 'వెన్నుపోటు'కే వెన్నుపోటు పొడిచారా? దీనికి సమాధానం ఎవరు చెబుతారు? 2024లో వైకాపా అధికారం కోల్పోయిన తర్వాత ఎక్కడా జనాల్లో కనపడని రామ్‌మనోహర్ నాయుడు కనీసం తండ్రి తరపున వెన్నుపోటు కార్యక్రమంలో కూడా పాల్గొనకపోవడం గమనార్హం. ధర్మాన ప్రసాదరావు మంత్రిగా ఉన్నప్పుడు శ్రీకాకుళం నియోజకవర్గం వరకు ఆయనే అంతా అయి వ్యవహరించారు. పలకరింపులు, పరామర్శలు, సమస్య పరిష్కరించామన్న స్టేట్‌మెంట్లు అన్నీ ఆయనే ఇచ్చేవారు. ఇప్పుడు తన ఆరోగ్యం సహకరించడంలేదంటూ ధర్మాన ఏడాదిగా పార్టీ కార్యక్రమాలకు దూరమైనా కనీసం ఆయన తరపున ఆయన తనయుడు కూడా యాక్టివ్ కాకపోవడంతో నువ్వెప్పుడు నాయకుడివవుతావు చిన్నిబాబు అంటూ వైకాపా కార్యకర్తలు అడిగితే ఏం సమాధానం చెబుతారు? బుధవారం నడినెత్తిన సూర్యుడు నిప్పులు కురిపించినా తమ నాయకుడు ఇచ్చిన పిలుపు మేరకు మహామహులంతా ఇక్కడ భారీ ఎత్తున ర్యాలీ చేశారు. ఈ - మిగతా చివరి పేజీలో

# విన్నపాలు.. అభాసుపాలు


గ్రీవెన్స్‌లో తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

- పెట్రోల్‌తో వెళ్లినా గుర్తించని సెక్యూరిటీ
- నోట్లకట్టలు విసిరినా స్పందించని అధికారులు
- పరిష్కరించకుండానే గ్రీవెన్స్ క్లోజ్ చూపిస్తున్న వైనం
- ప్రజాగ్రీవెన్స్‌పై సన్నగిల్లుతున్న ఆశలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాపరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజాగ్రీవెన్స్‌కు వందలకొద్దీ వినతులు ప్రతీ వారం వస్తున్నాయి. నిజంగా వీరంతా సమస్యలున్నవారేనా? అదే నిజమైతే ప్రతీ వారం నిర్వహిస్తున్న వినతులిచ్చేవారి సంఖ్య పెరుగుతుంది తప్ప.. ఎందుకు తరగడంలేదన్న అనుమానం కలగొచ్చు. వాస్తవానికి కొద్ది వారాల క్రితం సమస్యలు పరిష్కరించాలంటూ వచ్చినవారే, ఆ పని కాకపోవడం వల్లే మళ్లీ మళ్లీ గ్రీవెన్స్ మెట్లెక్కుతున్నారు. ప్రజాగ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలనే నిబంధనల ఉండటంతో సమస్య పరిష్కారం కాకపోయినా, మీ పని పూర్తయిపోయిందంటూ సంబంధిత బాధితుడికి మెసేజ్ పెట్టేస్తున్నారు. మా సమస్య ఇంకా అలానే ఉంది మహాప్రభో అంటూ మళ్లీ గ్రీవెన్స్‌కు వస్తే, పరిష్కారమైపోయిందని కంప్యూటర్‌లో నమోదైపోయింది కాబట్టి ఈ సమస్య మళ్లీ తీసుకోవడం కుదరదంటూ వెనక్కు పంపించేస్తున్నారు. అలాంటప్పుడు ప్రజాదర్బారులు ఎందుకన్న ప్రశ్న తలెత్తుతోంది. పరిష్కారం కాని సమస్యల కోసం నిర్వహిస్తున్న ఈ గ్రీవెన్స్ కూడా వివాదాస్పదం కావడం కొసమెరుపు.

గతంలో ఎప్పుడూ లేనివిధంగా జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ ప్రతివారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారితీస్తుంది. దీనికి ప్రధాన కారణం పోలీసుల నిర్లక్ష్యం కాగా, అధికారులు సమస్యకు పరిష్కారం చూపించడంలో విఫలం కావడం, కొన్ని రకాల ఫిర్యాదులు గ్రీవెన్స్‌లో నమోదు చేయకుండా తిప్పి పంపించడమే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రీవెన్స్‌కు అర్జీదారుడు ఫిర్యాదు ఇచ్చిన 15 రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపించాలి. ప్రతి గ్రీవెన్స్‌ను జిల్లా, రాష్ట్రస్థాయిలో మోనటరింగ్ చేస్తుండడంతో ఫిర్యాదులు, వినతులకు కచ్చితంగా పరిష్కారం చూపించాలి. ఫోన్‌కు సూక్ష్మసందేశం పంపడం, లేదంటే అర్జీదారుడికి హార్డ్‌కాపీ ద్వారా సమస్య పరిష్కారంపై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో అన్ని వినతులు, ఫిర్యాదులకు పరిష్కారం చూపించినట్టు అర్జీదారుడికి ఏదో ఒక రూపంలో సమాచారం పంపిస్తున్నారు. మళ్లీ ఆ అర్జీదారుడు సమస్య పరిష్కారం కాలేదని గ్రీవెన్స్‌కు వస్తే, దాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని విమర్శలు ఉన్నాయి. ఇలాంటి సమస్యలతో పలు దఫాలుగా వచ్చి గ్రీవెన్స్‌లో హడావుడి చేస్తున్నారు.

గత నెల 5న నగరంలోని బాకర్‌సాహెబ్‌పేటకు చెందిన వృద్ధురాలు లొట్టి మంగమ్మ దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్‌కు పరిష్కారం చూపడం లేదనిం వాటర్ బాటిల్‌లో పెట్రోల్ నింపుకొని గ్రీవెన్స్‌లోకి వచ్చేసింది. కలెక్టర్, జేసీ ఇతర అధికారుల వద్దకు నేరుగా వెళ్లి పెట్రోల్‌ను ఒంటి మీద పోసుకుంది. దీన్ని గమనించిన మరుక్షణమే కలెక్టర్ స్పందించి గ్రీవెన్స్‌లో ఉన్న మహిళా కానిస్టేబుల్స్‌ను పిలిపించి వృద్ధురాలిని పక్కకు తీసుకువెళ్లి సముదాయించారు.


గంగమ్మను సముదాయించి తీసుకువెళ్తున్న కలెక్టర్ (ఫైల్‌ఫొటో)

అలాగే ఈ నెల 2న గ్రీవెన్స్‌లో మరో ఘటన చోటుచేసుకుంది. ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన సనపల సురేష్‌కుమార్ జేబులో నుంచి నోట్లకట్టలు బయటకు తీసి సమస్యలు పరిష్కరించడానికి ఎంత లంచం ఇవ్వాలని గ్రీవెన్స్‌లో జేసీ, ఇతర అధికారులకు ప్రశ్నించారు. ఆమదావలసలో ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా, వాల్టాచట్టాన్ని తుంగలో తొక్కి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారని ఫిర్యాదు చేస్తే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. గ్రీవెన్స్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేయకుండా బాధ్యులపై చర్యలు తీసుకోకుండా రెవెన్యూ, మైన్స్ అధికారులు లంచాలు తీసుకొని విడిచిపెట్టేస్తున్నారని అధికారులను నిలదీశారు. లంచాలు కావాలంటే తాను ఇస్తానని, తక్షణమే ఇసుక అక్రమ రవాణా నిలుపుదల చేయించాలని జేబులో నుంచి నోట్ల కట్టలు చేతిలో పట్టుకొని అధికారులందరికీ చూపించారు. ఎవరికి లంచం కావాలంటే వారు తీసుకొని తన ఫిర్యాదుపై స్పందించాలని సురేష్ అన్నారు. ప్రతివారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్నా సమస్యకు పరిష్కారం చూపించలేదన్నారు. తాను వారి మాదిరిగానే ఎంత కావాలంటే అంత లంచం ఇస్తానని, దీనికి ప్రతిగా ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలని, కాదంటే పదే పదే ఫిర్యాదు చేస్తున్నందుకు తననైనా అరెస్టు చేయాలని, లేదా అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. సురేష్ వ్యవహారంపై అధికారులు ఎలా స్పందించాలో తెలియక నచ్చజెప్పి పంపించేశారు.


నోట్ల కట్టలతో అధికారుల ముందు సురేష్ కుమార్ (ఫైల్‌ఫొటో)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ వద్ద గతం కంటే భిన్నంగా పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. జెడ్పీ సమావేశ మందిరం ప్రధాన గేటు వద్ద ఏర్పాటుచేసిన డిటెక్టర్ నుంచి పంపించి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మీడియా ప్రతినిధులను అడ్డకొని మీడియా గుర్తింపు కార్డు చూపిస్తేనే లోపలికి పంపిస్తామని అడ్డుకున్న సందర్భాలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో గ్రీవెన్స్‌లో హాజరు కావడానికి వచ్చే అధికారులు, ఉద్యోగులను నిలిపి మీరెవరని ప్రశ్నించిన సందర్భాలూ ఉన్నాయి. గ్రీవెన్స్‌లో కొందరు కానిస్టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. అయినా లొట్టి మంగమ్మ పెట్రోల్ బాటిల్‌ను తనతో పట్టుకొని, సురేష్ నోట్ల కట్టలను తీసుకొని లోపలికి ఎలా వెళ్లగలిగారు. గతంలో సురేష్ ఫిర్యాదు చేయడం వల్ల ఆమదాలవలస పరిధి రాగోలుపేట సమీపంలో ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఆతర్వాత సురేష్‌కుమార్‌పై దాడిచేసి గాయపరిచారు. ప్రతి వారం సురేష్ ఇసుక అక్రమాలపై ఫిర్యాదు చేయడానికి వస్తూనే ఉన్నాడు. అయినా పోలీసులు తనిఖీలు చేయలేదు, గ్రీవెన్స్‌లో నోట్లకట్టలు తీసి హంగామా చేసినా స్పందించలేదు. దీంతో పోలీసు గ్రీవెన్స్ వద్ద విధులు నిర్వహించే పోలీసుల వ్యవహారంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటారా? లేదంటే మళ్లీ విమర్శలు పాలవుతారో చూడాలి.






## పర్యావరణ పరిరక్షణ

# అందరి బాధ్యత

- భవిష్యత్తు తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందిద్దాం
- 6 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భవిష్యత్తు తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యతని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం (వనమహోత్సవం) సందర్భంగా శ్రీకాకుళంలో జరిగిన భారీ ర్యాలీని కింజరాపు రామ్మోహన్ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. పాత్రునివలస ఫ్లైఓవర్ నుంచి సాగిన ఈ ర్యాలీ అనంతరం జిల్లాలో ఒక్కరోజులో 6లక్షల మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. పర్యావరణ, అటవీ, శాస్త్ర, - మిగతా చివరి పేజీలో

• ఎడిటోరియల్

# ఇకనైనా ఆలోచిద్దాం!

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద విజయోత్సవంలో సంభవించిన తొక్కిసలాటలో 11 మంది చనిపోయారు. 50 మంది గాయపడ్డారు. క్రికెట్ ఈ దేశంలో ఎంత అతిగా మారిందనేదానికి ఈ ఘోర దుర్ఘటన ఓ సాక్ష్యం. ఎందుకు అతిగా మారదు గెలిచిన టీం సభ్యులకి స్వాగతం చెప్పడానికి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి స్వయంగా ఎయిర్‌పోర్టుకు వెళితే? కర్ణాటక చరిత్రలోనే ఐపీఎల్ గెలవడం ఓ సువర్ణాధ్యాయం అన్నట్లు రాజకీయ నాయకులు, మీడియా ఓవరాక్షన్ చేస్తే సామాన్యుల మీద ఎంతో ప్రభావం చూపించకుండా వుంటుందా? కళలు, క్రీడలు కేవలం మానసికోల్లాసానికి ఉద్దేశించినవి. ఐతే ఈ రెండూ పూర్తిగా వాణిజ్యపరమైనందువల్ల వాటి పరిధిని, ప్రాముఖ్యతని దాటి దేశం నవనాడుల్నీ కుంగదీస్తున్నాయి. ఒక కళగా సినిమాని, ఒక క్రీడగా క్రికెట్‌ని అభిమానించొచ్చు.. తప్పులేదు. అయితే మితిమీరిన వాణిజ్యీకరణ వల్ల ఈ రెండూ జనాల మెదళ్ల మీద పాము పుట్టల్లా లేచి వారి ఆలోచనా శక్తిని, సృజనాత్మకతని ధ్వంసం చేసి, సాంస్కృతికంగా పట్టి పీడిస్తూ దేశానికి సంబంధించిన మరింక దేని గురించీ ఆలోచించడానికి వీల్లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా ఐపీఎల్ వచ్చినప్పటి నుంచి జాతిని క్రికెట్ ఓ జ్వరంలా తగులుకుంది. ఇదివరకటి రోజుల్లో గుర్రప్పందేలుండేవి. ఐపీఎల్ దాన్ని మించిపోయింది. ఫ్రాంచైజీలు ఆటగాళ్లను కొనుగోలు చేయడం, డిస్కార్డ్ చేయడం, రిటెయిన్ చేయడం.. అంతా క్రీడా నైపుణ్యానికి సంబంధం లేని వాణిజ్య వ్యూహాలతో ఆటని ఓ జూదంలా, గుర్రప్పందెంలా మార్చేశాయి. ప్రేక్షకుల్ని ఫ్రాంచైజీలకు మానసికంగా బానిసలుగా తయారుచేశారు. ఫలితంగా ఆటగాళ్లు లాభపడుతున్నారు. బీసీసీఐ ఆర్థికంగా బలిసిపోతున్నది. ఆర్థికంగా చూస్తే మనది ఓ పేద దేశం. కానీ బీసీసీఐ ప్రపంచంలోనే రిచ్చెస్ట్ స్పోర్ట్స్ బోర్డ్. ఈ వైరుధ్యం అసహజంగా లేదూ? ఇవాళ చనిపోయి, గాయపడ్డవారందరూ ఈ దేశంలో క్రికెట్ పిచ్చి ఎంతగా వుండకూడని స్థాయిలో వుందో నిరూపిస్తున్నారు. 35వేల సీటింగ్ కెపాసిటీ మాత్రమే వున్న స్టేడియంకి 3 లక్షలమంది హాజరయ్యారంటే.. ఈ పిచ్చిని పెంచి పోషిస్తున్నదెవరు? ఆటని, ఆటగాళ్లని తప్పు పట్టక్కర్లేదు. ప్రధాన ముద్దాయి బీసీసీఐ. సొమ్ము చేసుకోవడం మీదనే దాని దృష్టంతా. ఇదివరకటి రోజుల్లో ప్రతి సంవత్సరం క్రికెట్‌కి ఒక సీజన్ అంటూ వుండేది. దాదాపు ఎండాకాలం, వర్షాకాలం క్రికెట్‌కి సెలవు వుండేది. కేవలం టెస్ట్ మ్యాచెస్ మాత్రమే జరిగేవి. తర్వాత వన్డే మ్యాచెస్ వచ్చాయి. ఇక్కడి నుంచే క్రికెట్ పిచ్చి ఎక్కువవడం మొదలైంది. జెంటిల్మెన్ గేం కమర్షియల్ గేం అయింది. బౌలర్లు నిస్సహాయులై పోయి క్రికెట్ బాట్స్‌మెన్ గేం అవడం కూడా దీనితోనే మొదలైంది. ఆ తర్వాత టి-20 పుట్టుకొచ్చింది. ఇది క్రికెట్‌ని క్లాస్ పరంగా అథఃపాతాళానికి, వాణిజ్యపరంగా ఆకాశానికి తీసుకెళ్లింది. క్రికెట్ పొట్టిది అవుతున్న కొద్దీ జనాల్లో దాని పట్ల వేలం వెర్రి పెరగసాగింది. అసలు జనాల్లో వేలం వెర్రి పెంచడానికి అనుగుణంగానే దాని ఫార్మాట్లో మార్పులు తీసుకొచ్చారు. చివరగా ఐపీఎల్ క్రికెట్‌ని, ప్రేక్షకుల్ని ఇంక దిగజార్చడానికి ఏమీ మిగల్చకుండా రూపొందించబడింది. ఇప్పుడు సంవత్సరం మొత్తం క్రికెట్‌కి సీజనే. క్రికెట్‌ని సమాజానికి హానికరంగా దిగజార్చిన జాబితాలో బీసీసీఐ తర్వాత స్థానం ఎలక్ట్రానిక్ మీడియాది. ఈ రోజున ఎలక్ట్రానిక్ మీడియా మొత్తం కార్పొరెటైజ్ ఐపోయింది. పెట్టుబడి సామాజిక విలువల్ని ఎంతగా ధ్వంసం చేయగలదనే దానికి ఎలక్ట్రానిక్ మీడియా ఓ పెద్ద సాక్ష్యం. మిగతా క్రీడలు ఎదగకుండా చేసిన పాపం కూడా ప్రభుత్వంతో పాటు మీడియా కూడా మోయాల్సిందే. ప్రజలు దేశంలో మరే సమస్యల గురించి, పాలకుల వైఫల్యాల గురించి ఆలోచించనివ్వకుండా క్రికెట్ తయారైందంటే దానికి ఏదో ఒక పాలక వర్గానికి చేరువగా వుండే ఎలక్ట్రానిక్ మీడియానే కారణం. క్రికెట్ పట్ల మితిమీరిన క్రేజ్ తమ మానసిక ఆరోగ్యానికి, దేశ ఆరోగ్యానికి హానికరమని గుర్తించాలి. ఇది కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుతో రాజీనామా చేసి తీరవలసిన దుస్సంఘటన. దీని వెనుక అధికార మార్పు కోసం జరిగే కుట్ర కోణం కూడా దాగి ఉండవచ్చు. చదువుకున్న వాళ్లు కూడా మూర్ఖులు లాగా పద్దెనిమిదేళ్ల నుంచి ఎదురు చూస్తున్నాం, వచ్చి తీరాలి అంటూ అదేదో వరల్డ్ కప్ అన్నట్టు పూనకాలతో ఊగిపోయారు. ఆ కప్పు మనం తయారు చేసుకున్నదే, విరాట్ కోహ్లీ అయినా, శ్రేయాస్ అయ్యర్ అయినా మన ప్రాణాలు వాళ్లు సాధించే ఆ కప్‌ల కంటే చాలా చాలా విలువైనవని ఈ దేశంలో ప్రతి క్రికెట్ అభిమానీ తెలుసుకోవాలి..! అసలు ఆర్‌సీబీకి, బెంగళూరుకి సంబంధమేంటి? బెంగళూరుకు చెందిన ఓ లిక్కర్ సామ్రాజ్య నేత పెట్టిన పేరు ఇది. ఇందులో కోహ్లీ నుంచి ఎవరూ బెంగళూరుకు చెందినవారు కాదు. ఆమాత్రం దానికి ఆర్‌సీబీ గెలిచాక ఈ బలిదానాలెందుకు?

## శాఖా గ్రంథాలయంలో పర్యావరణంపై స్కిట్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా "పచ్చని చెట్టు నేను ప్రాణవాయు పట్టుని నేను" అంటూ విద్యార్థులచే స్కిట్‌ను ప్రదర్శించారు ఈ స్కిట్‌ను బాల కథానిలయం అధ్యక్షులు బోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు ప్లాస్టిక్ భూతాన్ని విడనాడాలి, గుడ్డ సంచుల నే వాడాలి చెట్లు నరకకూడదు ప్రతి గుడి, బడి అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లను పెంచాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సహాయకురాలు కె అనిత 27 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





ప్రపంచ పర్యావణ దినోత్సవం, వన మహోత్సవం -2025 సందర్భంగా చిలకపాలెం గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మండల ప్రజా పరిషత్ వారి సమక్షంలో, జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ఆధ్వర్యంలో ఈ మొక్కలు నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ మాజీ అధ్యక్షులు చౌదరి బాబ్జి, మాజీ సర్పంచ్ చిలక రాము, సీనియర్ నాయకులు గాలి వెంకటరెడ్డి, అప్పలరాజు, గాడు రామారావు, బోను శ్రీను, శేఖరు, శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలుతో కలసి పర్యావరణ దినోత్సవ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, ఎచ్చెర్ల

## పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత

# ప్రతి ఒక్కరిపైనా ఉంది

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ మండల అధ్యక్షులు సనపల రామారావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇబ్రహీం బాద్ సచివాలయంలో గురువారం ఆయన కూటమి నాయకులతో కలిసి అనంతరం మాట్లాడుతూ పర్యావరణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు కాలుష్యాన్ని తగ్గించడానికి మన వంతు బాధ్యతగా ముందుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కాలుష్య నివారణ సాకారం కావాలంటే ఏ ఒక్కరితోనో సాధ్యపడదని, సమష్టికృషితోనే సాధ్యమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ నిర్మించి భావితరాలకు బంగారు భవిష్యత్తును అందిద్దాం అందరికీ ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలను రామారావు తెలిపారు.



# పర్యావరణ పరిరక్షణ- అందరి బాధ్యత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రకృతిని పరిరక్షించేందుకు ఒక్కరోజే ఒక పెద్ద హరిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతీ పౌరుడూ ఈ రోజు ఒక మొక్కను నాటి, దేశ పరిరక్షణలో భాగం కావాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రకృతి పరిరక్షణకు కట్టుబడి, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక్కరోజే ఐదు లక్షల మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఆయన ఆధికారనివాసంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో మొక్కలను నాటిననంతరం తెలిపారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, సేవలకు ఎప్పుడూ ముందువరుసలో ఉంటారని, వారి సేవలు అమోఘమన్నారు. మొక్కను నాటడమే కాకుండా, వాటి సంరక్షణ బాధ్యత కూడా చేపట్టాలన్నారు. జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, డిసి. బాడాన. దేవభూషణ్, నూతన ఉపాధ్యక్షురాలు డా.పైడి సింధూర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణం గురించి అవగాహన కల్పించే వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం, నీటిని ఆదా చేయడం, వాయు కాలుష్యాన్ని తగ్గించడం వంటి అవగాహన కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తే, పర్యావరణ మార్పులు చూడచ్చున్నారు. ప్లాస్టిక్ వద్దు, పర్యావరణానికి గుడ్డ సంచులు ముద్దని, గుడ్డ సంచులను జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అందరికీ అందించారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన కార్యదర్శి టెక్కం రాంగోపాల్, కోశాధికారి బి. కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

(సత్యంన్యూస్, టెక్కలి)

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు "ప్రపంచ పర్యావరణ దినోత్సవం" సందర్భంగా టెక్కలి తహసీల్దార్ కార్యాలయంలో టెక్కలి తహసిల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు అధ్యక్షతన ఎన్ఆర్ఈజీఎస్ వారి సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ హౌసింగ్ ఏఈ, ఏపీఎం, వివిధ శాఖల అధికారులు, టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఆ రెండిటి మీద శ్రీలీల ఆశలు..?



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రీలీల ఇలా వచ్చి అలా తన యాక్టింగ్ డ్యాన్స్ లతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ధమాకా హిట్ తో టాప్ లీగ్ లోకి వెళ్లిన శ్రీలీల ఆ వరుసలోనే స్టార్ అవకాశాలు తెచ్చుకుంది. చేసిన సినిమాలు కొన్ని ఫ్లాప్ అవ్వడం వల్ల అమ్మడికి షాక్ తగిలినట్టు అయ్యింది. ఒకటి రెండు ఛాన్స్ లు చేతిదాకా వచ్చి చేజారాయి. ఐతే ఇక అమ్మడి పని అయిపోయిందా అనుకునే సరికి మళ్లీ పుంజుకుంటుంది. శ్రీలీల తెలుగులో రెండు సినిమాలు చేస్తుంది. అందులో ఒకటి మాస్ జాతర కాగా మరొకటి లెనిన్. ఈ రెండు సినిమాలు కూడా మంచి అంచనాలతో వస్తున్నాయి.

అఖిల్ సరసన మొదటిసారి జత కడుతున్న శ్రీలీల లెనిన్ అంటూ రాబోతుంది. సినిమా టీజర్ ఇంప్రెస్ చేయగా సంథింగ్ స్పెషల్ గా ప్రాజెక్ట్ ఉండేలా ఉంది. మరోపక్క మాస్ జాతర సినిమా కూడా రవితేజ మార్క్ మాస్ ఎంటర్టైనర్ గా వస్తుందని తెలుస్తుంది. ఈ రెండు సినిమాల మీదే శ్రీలీల తన ఆశలన్నీ పెట్టుకుంది. తెలుగులో మళ్లీ వరుస అవకాశాలు రావాలంటే మాత్రం ఇవి హిట్టు పడాల్సిందే.టాలీవుడ్ లో కాకుండా శ్రీలీల కోలీవుడ్ లో పరాశక్తి సినిమా చేస్తుంది. శివ కార్తికేయన్ హీరోగా సుధ కొంగర డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఆ మూవీపై కూడా ఇంట్రెస్టింగ్ బజ్ నడుస్తుంది. వీటితో పాటు బాలీవుడ్ లో కార్తీక్ ఆర్యన్ తో శ్రీలీల ఆషికి 3 సినిమా చేస్తుంది. ఆషికి 2 ఎంత పెద్ద హిట్టైందో తెలిసిందే. ఆఫ్టర్ లాంగ్ గ్యాప్ ఆషికి 3 వస్తుంది. ఆ సినిమాలో శ్రీలీల ఛాన్స్ అందుకోవడం గొప్ప విషయం. ఈ సినిమా అంచనాలను అందుకుంటే మాత్రం శ్రీలీల బాలీవుడ్ లో సూపర్ క్రేజ్ తెచ్చుకునే ఛాన్స్ ఉంది. ఇవే కాకుండా మరో రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని తెలుస్తుంది. ఐతే అక్కడ ఇక్కడ ఏమో కానీ శ్రీలీల మాత్రం తెలుగులో తన సత్తా చాటాలని చూస్తుంది. ఎందుకంటే తెలుగులో చేస్తున్న పాన్ ఇండియా సినిమా ఛాన్స్ అందుకుంటే నేషనల్ వైడ్ గా పాపులారిటీ తెచ్చుకునే అవకాశం ఉందని అలా సెట్ చేస్తుంది అమ్మడు. మరి అమ్మడి ప్రయత్నాలు ఎంతవరకు వర్క్ అవుట్ అవుతాయో చూడాలి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

ఈపాటికి నోరారా 'కేలడీ కన్మణి పాడగన్ సంగదీ' అంటూ ఆ నల్లబంగారం స్వరపరచిన పాటొకటి హృద్యంగా పాడుకుంటూ ఉండాల్సినవాడివి. ఇన్నేళ్లనించీ వింటున్నా సరే మాకే నరనరం ఉప్పొంగు తోంటే ఆ అందాల వరసల్ని నదిపాయల్లా మలుపులు తిప్పుతూ మీరిద్దరూ ఎంత ఆనందాన్ని అనుభ వించి ఉంటారో కదా? కాలమెరుగని హిమవత్పర్వత సానువుల్లో పుట్టిన ఒకానొక జీవనది స్వేచ్ఛగా పరవళ్లు తొక్కుతూ ఏ ఆనకట్టల్నీ ఎదుర్కోవలసిన అవసరం లేకుండా తనకుతానుగా ప్రకృతిలో పార్శ్వం గా కలిసిపోతుంది. నీ పాట విన్న ప్రతిసారీ అదే భావన!

- జగదీశ్ కొచ్చెర్లకోట



అక్షరాలన్నీ పెట్టిపుట్టాయి నీ గొంతులో తానమాడేందుకు.. పదాలన్నీ తేనెలో మునకలేసి పెదాలను దాటి బయటపడేందుకు.. భాష మొత్తం దాసోహమంటూ నీ మాటల్లో ఒదిగిపోయేటందుకు... 'అడుగుల్ల సవ్వళ్లు కావమ్మా అవి ఎడదల్ల సందళ్లు లేవమ్మా!' అంటూ సుతిమెత్తగా నువు పాడుతుంటే అలికిడన్నదే తెలియనివ్వని సున్నితంపు పాదాల చిన్నదొకతి నట్టింట్లో తిరుగుతున్నట్లే అనిపిస్తుంది. అటువంటి పాటకు అంత మార్దవమూ అవసరమన్న ఆలోచన మామ మహదేవన్‌దా, ఆ కళాతపస్విదా లేక పాటే ప్రాణమనుకునే నీదా? ఏదైతేనేం, మాకు మాత్రం పరవశాల పందేరం.

'ఒరిగింది చంద్రవంకా వయ్యారి తారవంకా' అంటూ మాస్టారి ముందు వినయంగా ఒదిగి మరీ ఆయనతో కలిసి నువు పాడిన ఆపాట వింటే మాకు ప్రతిరాత్రీ వసంతరాత్రే! వయసునలా వాకిట్లోనే నిలబెట్టేసిన నీకు పాట మీదకు వార్ధక్యమెలా వస్తుంది? ఇక ఎప్పటికీ ఇలాగే పాడుకుంటూ ఉంటావని, కృష్ణ తరవాత మహేష్‌బాబు, అక్కినేని నుంచి అఖిల్ వరకూ అందరికీ యవ్వనాన్ని గొంతులోనే పలికిస్తావనీ అనేసుకున్నాం. తెలుగునేలపై ఎన్నో కలాలు అనంతమైన భావామృతాలను ఒలికించాయి.

'పాలకు దాకగా..మధువుకు పాత్రగా.. రూపం ఏదైనా మన్నొకటేరా..' అనే వేదాంతం.. 'పెరుగుతుంది వయసనీ అనుకుంటాము.. కాని

# నేనిన్నాళ్లు చేసింది ఆరాధన..

# నేనీనాడు తెలిపింది నా వేదన!



తరుగుతోంది ఆయువనీ తెలుసుకోము'.. అంటూ నిజజీవితసత్యాల్ని..

'ధరతక్కువ బంగారానికి ధాటిఎక్కువ.. నడమంత్రపు అధికారానికి గోతులెక్కువ' అని హెచ్చరించే ప్రబోధాత్మక గీతాలనీ ప్రేమాస్పదమైన పలకరింపులనీ, ప్రణయరాగ వాహినులనీ కూడా తమ జ్ఞానాన్ననుసరించి ఒలికించారు.

అంతటి సంపదనూ అపాత్రదానం చెయ్యలేక ఆ పాత్రలన్నిటికీ సమన్యాయమొనరింపగల ఏకైక గాత్రసౌందర్యం నీదని నీచేతే పాడించారు. ఆ కారణంగానే అవన్నీ ఈనాటికీ మా ఇళ్లలో సుప్రభాతాల్లా వినబడుతున్నాయి. మావీధి మొదట్లో గుబురైన కొమ్మల్లోంచి ప్రతి ఉదయం కోయిలొకటి కమ్మగా పాడుతూ ఉంటుంది. అది ఒకటే కోయిలో, రోజుకొకటో గుర్తుపట్టలేం.

చుట్టూ ఎన్ని కోయిలలున్నా మధ్యలో నిలబడి సుస్పష్టమైన గాత్రంతో వైవిధ్యానికి ప్రతీకలా వినబడే నిన్ను మాత్రం ఇట్టే గుర్తుపట్టేస్తాం. అంతవరకూ చెవులను తాకుతున్న పాట అకస్మాత్తుగా మనసుని పలకరిస్తుంది. 'ఈ లైన్లన్నీ బాలు పాడిన'వంటూ అండర్‌లైన్ చేసేట్టుగా మార్చేస్తావు పాటని. పుట్టినవానికి మరణము తప్పదంటూ వ్యాసభగవానుడు గీతలో చెప్పినా నీ గీతానికి మాత్రం మరణమనేదే ఉండబోదనే అత్యాశతో బ్రతికాం. వార్ధక్యంలో కూడా భౌతిక మరణం బాధిస్తుందని నీవల్లే తెలిసింది. నీ పాట ఆగడంతో మాకు ఊపిరాడనట్టయింది. నీ ఊపిరాగిన మరుక్షణం పాటకు ప్రాణం పోయింది. జయంతి నివాళులు బాలూ!

## పర్యావరణ పరిరక్షణ కర్తవ్యంగా భావించాలి

(సత్యంన్యూస్, లావేరు)

ప్రపంచ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ కర్తవ్యంగా భావించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సూచించారు. ఈమేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం లావేరు హైస్కూల్లో ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జల వనరులను సంరక్షించుకోవడం మన కర్తవ్యంగా భావించాలన్నారు. అందుకే ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిందని, దీనిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముప్పిడి సురేష్, లూకలావు అప్పలనాయుడు, బర్నాల దుర్గారావు, తోటయ్య దొర, మీసాల వెంకటరమణ తదితర నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు పాల్గొన్నారు.



## పర్యావరణం బాగుంటే మానవమనుగడ బాగుంటుంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పర్యావరణం బాగుంటే, మానవమనుగడ బాగుంటుందని, స్థానిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ కె.శివశంకర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటినంతరం అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనందరి పైన ఉందని, ప్రస్తుతం ఎన్నో విపత్తులు పర్యావరణం రక్షించుకోకపోవడం వలన అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. నేటి యువత పర్యావరణంపై దృష్టి పెట్టాలని, వీలైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని, వాహనాల వాడకాన్ని తగ్గించి పర్యావరణ రక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతీ ఒక్కరు ఒక మొక్కను నాటి దాని పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని, దీనివలన మనం పర్యావరణాన్ని రక్షించుకోగలుగుతామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.





బొద్దూరు జెడ్పీ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయులు అదపాక దామోదర రావు తెలుగులో మబ్బు పేరుతో, ఆంగ్లంలో లేబునోనిటీ పేరుతో రచించిన పుస్తకాన్ని విజయనగరం డీఈఓ మాణిక్యాలనాయుడు ఆవిష్కరించారు కార్యక్రమంలో విజయనగరం డిసిసిబి చైర్మన్ సన్యాసిరాజు డిప్యూటీ డీఈఓ ఆర్ వెంకట్రావు, జిల్లా సైన్స్ అధికారి రాజేష్, గొర్లి పద్మావతి, గదే అప్పలనాయుడు, ఆర్వేటి నాయుడు జయకృష్ణలు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, విజయనగరం



పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బూర్జ మండలం, పెద్దపేట పంచాయతీ, ఆర్ట్ సంస్థలో ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, శ్రీకాకుళం డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యం తదితరులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, ఆమదాలవలస

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



(సత్యంన్యూస్, కొత్తూరు)

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయం ప్రాంగణం, కంచక చెరువు గట్టు వద్ద పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ 1974లో పర్యావరణదినోత్సవం మొదటిసారిగా జరుపుకున్నారన్నారు. అందరూ జీవిత కాలంలో సంవత్సరానికో మొక్క నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయనతో పాటు సర్పంచ్ పడాల క్రిష్ణవేణి, ఫీల్డ్ అసిస్టెంట్ మొదలగు వారు ఉన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

(సత్యంన్యూస్, పాతపట్నం)

పర్యావరణాన్ని పరిరక్షించుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పెద్దసీది హైస్కూల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని కోటి మొక్కల వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పెద్దసీదిలో మొక్కలు నాటామన్నారు. అనంతరం మొక్కల సంరక్షణ పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కౌన్సెలింగ్ జరిపినందుకు అభినందనలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఇటీవల ఎంపీహెచ్ఏ (ఎం), రీ-డిప్లమెంట్ కౌన్సెలింగ్ డీఎం & హెచ్ఓ, ఆఫీస్ సూపెరింటెండెంట్ భాస్కర్ కుమార్‌లు సజావుగా జరిపించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం వారిని యూనియన్ నాయకులైన డి.సాయిప్రసాద్, ఎ.సత్యనారాయణ, ధర్మారావు, పూజారి, లక్ష్మీనారాయణ, మురళిలు దుశ్శావాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా కౌన్సెలింగ్ నిర్వహించినందుకు యూనియన్ నాయకులు, సభ్యులు అధికారులను ఘనంగా అభినందించి కృతజ్ఞతలు తెలియజేశామన్నారు. ఇదే విధంగా జరగబోయే జనరల్ ట్రాన్స్‌ఫర్స్ విషయంలో కూడా ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా జరపగలరని అధికారులను వినయపూర్వకంగా కోరుతున్నామన్నారు.



## పచ్చదనం కోసం పట్టుదల అవసరం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాలంటే అందరూ చైతన్యంతో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు రకాల మొక్కలను నాటి, పచ్చదనాన్ని పెంపొందించాలన్నదే ఈ కార్యక్రమం వెనక ఉద్దేశమని వారు చెప్పారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్క నాటి దాన్ని సంరక్షిస్తే, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాల్గవ అదనపు జిల్లా జడ్జి ఎస్ఎం ఫణికుమార్, చైర్మన్ జి.సువర్ణరాజు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.శాంతిశ్రీ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గేదెల వాసుదేవ రావు, ఏజిపి జి. వినయ్‌భూషణ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రఘురాం, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్, ప్రభుత్వ న్యాయవాదులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.




శ్రీకాకుళం దండి వీధిలో గల జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం 8:10 నిమిషాలకు చైర్మన్‌గా శివాల సూర్యనారాయణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆముదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో శివాల సూర్యనారాయణ కుటుంబసభ్యులు, డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దత్తి సత్యనారాయణ, సీఈఓ బి.నగేష్, సొసైటీ సీఈఓలు, బ్యాంక్ సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## జగన్మోహన్ రెడ్డి వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

జగన్మోహన్ రెడ్డి చరిత్ర మొత్తం వెన్నుపోటుకు విధానాలేనని ఆ పదానికి బ్రాండ్ కూడా అతనే అని తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ఉనికిని కాపాడుకోవడానికి అధికార పక్షంపై బురద జల్లే కార్యక్రమం చేస్తుందని నిజానికి జూన్ నాలుగో తేదీన ఏడాది క్రితం ప్రజలు ఆ పార్టీకి సమాది కట్టారని విమర్శించారు. నేటికీ సమాది కట్టి ఏడాది పూర్తైందని ఇది ఆ పార్టీకి ప్రధమ వర్ధంతి అని అన్నారు. కుటుంబ సభ్యులకు కూడా విడిచిపెట్టారు ట్టకుండా వెన్నుపోటు పొడిచిన నీవా తెలుగుదేశంపార్టీని విమర్శించేదని అన్నారు. రాజధాని లేని రాష్ట్రాన్ని చేసి మూడుముక్కల ఆట ఆడిన చరిత్ర నీదిఅని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి కుర్చీ కోసం తండ్రి శవం పక్కన సంతకాలు సేకరించడం వెన్నుపోటు కు నిలువెత్తు నిదర్శనమన్నారు.రాష్ట్రం బాగుండాలంటే అనుభవజ్ఞులైన చంద్రబాబు లాంటి నాయకుడ్ని ప్రజలు ఆశీర్వదించారని తెలిపారు.ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఎస్.డిల్లేశ్వరరావు,కొండబాబు బోర గోవిందరావు తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పర్యావరణంలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని ముగిద్దాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆర్జీయుకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో వృక్షార్పణ మరియు ప్లాస్టిక్ శుద్ధి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. “ప్లాస్టిక్ రహిత, పచ్చిక కాంపస్” లక్ష్యంగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసికట్టుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ గేదెల రవి విజయవంతంగా సమన్వయం చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్జేయుకేటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.డి.జి.బాలాజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గారు, అతిథులుగా ఐఐఐటీ అధికారులు డాక్టర్ అరుణ బాలాజీ, ముని రామకృష్ణ, శివరామకృష్ణ, కె.మోహనరావు, నరసింహప్పుడు, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. వారు పర్యావరణ పరిరక్షణపై ప్రేరణాత్మక సందేశాలను అందించారు.



## పర్యావరణ పరిరక్షణ పౌరుల ప్రాథమిక విధి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


నడిచే దారి, పీల్చే గాలి, త్రాగే నీరు, తినే ఆహారం, పంటనిచ్చే నేల ఇలా పర్యావరణం అంతా కలుషితం అయి విషతుల్యం అవుతోందని, మానవాళి అంతా మేలుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం స్థానిక చైతన్య కళాశాల ఆవరణలో చేపట్టిన వనక్రాంతి మొక్కలు నాటే కార్యక్రమంలో వక్తలు పిలుపు ఇచ్చారు. ఇందులో ముఖ్యంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, కాలనీలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని వనక్రాంతి ఉద్యమం నిర్వహించాలని కోరారు. ప్రతి నివాసిత ప్రాంతం పచ్చదనం పరిశుభ్రత కళకళలాడాలని అతిథులు ఆకాంక్షించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం పట్టణంలోని అరసవల్లి జంక్షన్‌లో గల చైతన్య కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కళాశాల యాజమాన్యం సౌజన్యంతో హర్షవల్లి లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం నిర్వహించింది. ఈ ఏడాది అంతా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తామని హర్షవల్లి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో హారికా ప్రసాద్, డాక్టర్ జామి భీమశంకర్, వావిలపల్లి జగన్నాథనాయుడు, డాక్టర్ చింతాడ కృష్ణన్‌మోహన్ డాక్టర్ మెడిసెట్టి సత్యస్వరూప్, తరళి, కరణం శోభారాణి, మణిశర్మ కార్యదర్శి, తర్లాడ అప్పలనాయుడు వైస్‌చైర్మన్, మీసాల మాధవి, సుమన్, నీహార్, జ్యోతిర్మయి, శ్రీనివాస్, పార్వతీశ్వరరావు, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అవినీతి పాలనకు ప్రజలు స్వస్తి పలికి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పార్టీలు వేడుకలు నిర్వహించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో బుధవారం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ పేడాడ రామ్మోహన్‌రావు కూటమి పార్టీలయిన జనసేన, తెలుగుదేశం, బీజేపీ శ్రేణులతో కలిసి టపాసులు కాల్చుతూ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రజలు ఎంతో వెనకబాటుకు గురయ్యారని, గత ఎన్నికలను ఆయుధంగా చేసుకుంటూ రాక్షస పాలనకు స్వస్తి పలుకుతూ సరికొత్త ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని వారి భవిష్యత్తుకు బాటలు వేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోడీ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన నాటినుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటూ పండగ వాతావరణం లో ఈ వేడుకలను జరుపుకున్నారని తెలిపారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి భూగోళాన్ని రక్షిద్దాం

- పర్యావరణ పరిరక్షణపై అవగాహన ఉన్నా ఆచరణలోకి తీసుకురావడంలేదు
- ప్రజలంతా రాబోయే వర్షాకాలంలో మొక్కలు నాటుకుంటే బాగా పెరుగుతాయి
- డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు భేష్
- పీఎస్ఎన్ఎం హైస్కూల్‌లో మొక్కలు నాటిన కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్‌ను నియంత్రిస్తే భూగోళాన్ని రక్షించేవారమవుతామని కమిషనర్ ప్రసాదరావు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పీఎస్ఎన్ఎం హైస్కూల్ ఆవరణలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ (మెయిన్) శ్రీకాకుళం, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అందరికీ అవగాహన ఉన్నా ఆచరణలోకి తీసుకురావడానికి ముందుకు రావడంలేదన్నారు. రాబోయే వర్షాకాలమని, మొక్కలు నాటుకుంటే బాగా పెరుగుతాయని, మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించే బాధ్యత తీసుకుంటే పర్యావరణానికి మేలు చేసేవారమవుతామని అన్నారు. ప్రకృతిపై ఎంత హక్కు ఉందో, అంతకు మించి దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని కమిషనర్ సూచించారు. ఎంతోకాలంగా మొక్కలు నాటుతున్న డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను కొనియాడారు. అనంతరం అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ జామి చంద్రశేఖర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం, నాటిన మొక్కలు పరిరక్షించడం, ప్లాస్టిక్ వ్యర్థాల వలన అనర్థాలు, జీవకోటి ఆరోగ్యం మనుగడ, భావితరాల కోసం, కలుష్య నివారణ ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, ఎం. రాంజీ, పి.మాధవరావు, ఢిల్లీ భాస్కరరావు, డి. సుధాకరరావు, పిజీ గుప్త, టి.ఎస్.ప్రసాదరావు, సీహెచ్ దేవత్ ఆనంద్ (హెచ్ఎం), జిమ్ మాస్టర్ చంద్రమౌళి, డ్రైవర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గణపతిరావు, పైడిరాజు, గోపి, శ్రీకాంత్, రాము, బాబ్జీ, వెంకటరావు పాల్గొన్నారు.




# ప్రాథమిక స్థాయి నుంచే గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి

- ప్రతిరోజు యోగాసనాలు వేయండి
- గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్

(సత్యంన్యూస్, లావేరు)

ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గురువారం లావేరు శాఖా గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలన్నారు. శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం యోగా కార్యక్రమాన్ని చూశారు. విద్యార్థులతో పలు ఆసనాలు వేయించారు. బాగా చేసిన వాళ్లకి జిల్లా స్థాయికి మండల అధికారులు పంపుతారని అన్నారు. గ్రంథాలయ నిర్వహణ పట్ల అంకితభావంతో పని చేస్తున్న గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావును అభినందించారు. గ్రంథాలయానికి పుస్తకాలు అమర్చే రూ.10వేలు విలువ చేసే రాక్ తనవంతుగా ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు ముప్పుడి సురేష్, మాజీ వైస్ ఎంపీపీ ఇనుపుకుర్తి తోటయ్య దొర, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.





# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక విభాగం సంయుక్తంగా పాత్రునివలస ట్యాంక్ వద్ద ఏర్పాటుచేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు జిల్లాలో 6 లక్షల మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. 'మొక్క మానవాళి మనుగడకు జీవాధారం. భవితరాలకు ప్రాణవాయువు అందించాలంటే ప్రతి ఒక్కరూ తమ నివాస పరిసరాల్లో మొక్కలు నాటాలి. నాటిన ప్రతి మొక్కను పెరిగి పెద్దదయ్యే వరకు సంరక్షించే బాధ్యత మనదే' అని ఆయన ఉద్ఘాటించారు. భవిష్యత్తు తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలని ఆయన నొక్కి చెప్పారు.

**ప్లాస్టిక్ రహిత వస్తువులు వినియోగించాలి**

వాతావరణ కాలుష్యం కలిగించని వస్తువులను, భూమిలో కలిసిపోయే వస్తువులను వినియోగించాలని కేంద్ర మంత్రి సూచించారు. ప్లాస్టిక్ రహిత వస్తువులు వినియోగించే విధంగా తోటివారిలో చైతన్యం తీసుకురావాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం, శానిటేషన్‌పై ప్రజల్లో అవగాహన పెరిగినప్పటికీ, దానిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆయన తిలకించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అతిథులచే గోనె చేతి సంచులు (జూట్ బ్యాగులు) విడుదల చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరితో 'ఆకుపచ్చని ఆశయంతో స్వచ్ఛ హరితాంధ్ర అభివృద్ధికి తోడ్పడతామని' ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిఒక్కరూ తమ తల్లి పేరున ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారని గుర్తుచేస్తూ, ప్రతిరోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 'ప్లాస్టిక్ వద్దు' అనే నినాదంతో అందరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని కోరారు. అంతేకాకుండా, ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా మానసిక ఉల్లాసం, ఆరోగ్యం బాగుంటాయని సూచించారు. మునగ, వేప, బాదాం, బొప్పాయి, ఉసిరిక వంటి 5 రకాల మొక్కలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు జిల్లాలో 6 లక్షల మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. చెట్లు విరివిగా ఉండడం ద్వారా మంచి వాతావరణం కలుగుతుందని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కరుణ, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరావు, మహిళా శిశు సంక్షేమ అధికారిణి శాంతిశ్రీ, జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.వెంకటేష్, శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, పాత్రునివలస ప్రెసిడెంట్, తెలుగు యువత సమన్వయకర్త మెండ దాసునాయుడు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు వెంకటస్వామి, కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రకృతి వ్యవసాయం బలోపేతం చేయడానికి వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో పాటు జిల్లాలలో 2వ రోజు శిక్షణ కార్యక్రమంలో ఫీల్డ్ విజిట్ చేశారు. 12 రోజులు పీఎండీఎస్ ఫీల్డ్, 30 రోజులు పీఎండీఎస్ ఫీల్డ్, ఏటీఎం మోడల్, ఎ-గ్రేడ్ మోడల్ విజిట్ చేస్తూ రైతులు చేసే పద్ధతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 0.5 సెంట్లలో పీఎండీఎస్ 32 రకాల విత్తనాలు రైతు మెట్ట ధనుజయ్ పొలంలో డీపీఎం ఆధ్వర్యంలో నాటారు. అలాగే తమ్మినాయుడుపేట గ్రామంలో ప్రకృతి వనరుల కేంద్రం విజిట్ చేసి అక్కడ బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, విత్తన గుళికలు తయారుచేసి చూపించి, వాటి లాభాలు వివరించారు. జిల్లా డీపీఎం పూజారి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయ సంబంధిత రీజినల్ ఆఫీసర్ హేమసుందర్, ఏడీపీఎం ధనుజయ్‌రావు, ఏడీ, ఏవో, వీఏఏ, వీహెచ్‌వో.. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన డీఎంహెచ్‌వో

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి కార్యాలయ ప్రాంణంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని డాక్టర్ అనిత మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ సమస్యలు పరిష్కరించడానికి చెట్లను నాటడం, వ్యర్థాలను తగ్గించడం లేదా పునరుత్పాదక శక్తిని అందించడం వంటివి ప్రారంభించాలన్నారు. పర్యావరణం కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకట్, డీఐవో డాక్టర్ రాందాసు, డెమో వెంకటేశ్వరరావు, ఎఫ్ఎల్‌సీ అప్పారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




# అమరావతిని అత్యుత్తమ నగరంగా
# తీర్చిదిద్దడమే సీఎం ధ్యేయం



(సత్యంన్యూస్, అమరావతి)

అమరావతిని ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ధ్యేయంగా పని చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ, పారిశ్రామిక, పశు సంవర్ధక సహకార మార్కెటింగ్, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా పట్టణంలో గుంటూరు నియోజకవర్గం ఎమ్మెల్యేలు గల్లా మాధవి, ఎండీ నజీర్‌తో కలిసి వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ దేశంలో ఎక్కడైనా నిర్మాణాలకు 10 శాతం బ్లూ అండ్ గ్రీన్ ఉంటుందని, కానీ అమరావతిలో 30 శాతం బ్లూ అండ్ గ్రీన్ ఉండేలా నిర్మిస్తున్నామని, భవిష్యత్తులో ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు తగ్గించేలా పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామ న్నారు. సింగపూర్, జపాన్ వంటి దేశాలతో సంప్రదించి అక్కడి మాదిరిగా మంచి ప్లాంటేషన్ ఉండేలా చూడమని సీఎం ఆదేశించారని, అదే విధానంలో అమరావతిలో కూడా రకరకాల మొక్కలను శాస్త్రీయ విధానంలో నాటేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# ఇంకెప్పుడు నాయకుడివవుతావ్!

మొదటిపేజీ తరువాయి

కార్యక్రమంలో పాల్గొనకపోయినా జగన్మోహన్ రెడ్డి నుంచి ఎటువంటి నష్టమూ జరగని సీనియర్లు కూడా ఉన్నారు. కానీ చిన్ని ఎక్కడా కనిపించలేదు. ఇప్పుడేంటి? ఎన్నికల రిజల్ట్ వచ్చిన దగ్గర్నుంచి ఆయన కనపడకుండాపోయారు. ఎప్పుడైనా నాయకత్వ లక్షణాలు బయటపడాలంటే, లేదూ ఒక నాయకుడిగా ఎదగాలంటే గుంపు నుంచి విడిపోతే సాధ్యంకాదు. అలాగని గుంపులో కలిసిపోయినా సాధ్యంకాదు. గుంపునకు నాలుగడుగుల ముందు నడవాలని నెపోలియన్ చెప్పేవాడు. ధర్మాన ప్రసాదరావు ఇదే సూత్రం ఫాలో అయి ఇంత స్థాయికి ఎదిగారు. నాయకులు ఏసీల్లోను, కేడర్ మండుటెండలోను నడవాలా? అనే ప్రశ్న తలెత్తితే చిన్నీ ఏం చెబుతారు? బుధవారం వెన్నుపోటు కార్యక్రమం జరిగినప్పుడు చిన్నీ శ్రీకాకుళంలోనే ఉన్నారు. కానీ నలుగురితో పాటు ర్యాలీలో కనిపించలేదు. సాయంత్రం మాత్రం విజయవంతమైన కార్యక్రమాన్ని తన అకౌంట్‌లో వేసుకునే ప్రయత్నం చేశారు. ఇది ఏమాత్రం నాయకుడి లక్షణం కాదు. ధర్మాన ప్రసాదరావు ఎన్నికల్లో కేవలం ఓడిపోయారు అంతే.. లొంగిపోలేదు. ఓటమి వేరు, లొంగిపోవడం వేరు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం అనేది ఆయన వ్యూహంలో ఒక భాగం కావచ్చు. లేదూ అంటే అనారోగ్యమూ ఉండొచ్చు. కానీ తండ్రి అధికారంలో ఉన్నప్పుడు బంగ్లాకు వెళితే రామ్మనోహర్‌నాయుడుకు కూడా దండం పెట్టి వెళ్లాలని భావించిన వైకాపా కేడర్‌కు ఏడాదిగా ఎందుకు చిన్నీ కూడా అందుబాటులో లేకుండాపోయారు? ధర్మాన ప్రసాదరావు వారసత్వాన్ని రాజకీయంగా కూడా అందుకోవాలని చూస్తున్న చిన్నీ వెన్నుపోటు కార్యక్రమంలో కూడా కనపడకపోవడం చూస్తే ఇంకెప్పుడు నాయకుడవుతాడన్న ప్రశ్న తలెత్తక మానదు. పక్కనే ఉన్న నరసన్నపేట నియోజకవర్గంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కృష్ణదాస్, ఆ పార్టీ పరిశీలకుడు కుంభా రవిబాబుతో పాటు ఇచ్ఛాపురంలో జరిగిన వెన్నుపోటు కార్యక్రమంలో పాల్గొంటే, నరసన్నపేటలో కేడర్‌ను నిన్న రోడ్డు వెంబడి పరుగెత్తించింది కృష్ణదాస్ తనయుడు కృష్ణచైతన్య. అక్కడ కూడా ఈ కార్యక్రమం హిట్టయింది. దీనికి కర్త, కర్మ, క్రియ కృష్ణచైతన్యే అయి వ్యవహరించారు. ఇదే ధర్మాన కుటుంబం నుంచి పక్క నియోజకవర్గంలో తన సోదరుడు నాయకుడుగా ఎదుగుతున్నా, రాజకీయాల శైలి మారుతున్నా ఇంకా రామ్మనోహర్‌నాయుడు మాత్రం ప్రకటనలిచ్చి పబ్బం గడుపుకోవాలని చూడటం విడ్డూరం. అలా అని నగరంలోనో, ఈ నియోజకవర్గంలో ఉన్న మిగిలిన మండలాల్లోనో రామ్మనోహర్‌నాయుడు చెబితే వినని కేడర్ లేదు. ఆ ధీమాతోనే కదా.. జగన్మోహన్‌రెడ్డి పాలకొండ వచ్చినప్పుడు ధర్మాన బంగ్లా నుంచి అందరూ బయల్దేరాలని చిన్నీ పిలుపునిచ్చింది. ధర్మాన ప్రసాదరావు పిలుపు ఇవ్వకుండానే ఆయన పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఓ కార్పొరేట్ ఆసుపత్రిని ప్రమోట్ చేయడానికి ప్రతీ డివిజన్‌లోనూ ఉచిత వైద్యశిబిరాలు రామ్ మనోహర్‌నాయుడు ఏర్పాటుచేశారు. దీనివల్ల ఎంతమంది రోగులు ఆరోగ్యవంతులయ్యారో తెలియదు కానీ, ఒక పేద వైకాపా డివిజన్ ఇన్‌ఛార్జికి రూ.50వేలకు తక్కువ కాకుండా ఆ సమయంలో ఖర్చయింది. చిన్నీకి స్వాగతం పలుకుతూ బ్యానర్లు, ఫ్లెక్సీలు, కేడర్‌కు భోజనాలు, స్వాగత ఏర్పాట్లకే ఇంత ఖర్చు చేసినా, 2024లో ఓటమి తర్వాత చిన్నీ ఎవరికీ అందుబాటులో లేకుండా తిరుగుతున్నారు. ఎన్నిల్లో గెలుపోటములు సాధారణమని, తన తండ్రి తరఫున నేనున్నానని భరోసా ఇచ్చిన ప్రకటన ఒక్కటి కూడా రామ్మనోహర్‌నాయుడు చేయలేదు. ఏడాది కాలంలో వైకాపా చేపట్టిన ఏ కార్యక్రమాన్నీ ఆయన ఓన్ చేసుకోలేదు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు, విద్యుత్ ఛార్జీల పెంపుదల మీద నిరసన చేపట్టినప్పుడు చిన్నీ ఈమేరకు స్టేట్‌మెంట్ ఇవ్వలేదు. వాటిని కూడా ధర్మాన ముఖం చూసే కేడర్ అంతో ఇంతో సక్సెస్ చేశారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో పార్టీ చేపట్టే ఏ కార్యక్రమమైనా విజయవంతమైనా, ఫెయిలైనా అందుకు పూర్తి బాధ్యత ధర్మానదే. దీనికోసం ప్రత్యేకంగా క్రెడిట్‌లు, క్రెడెన్షియల్‌లు ఇచ్చుకోనక్కర్లేదు. ఎందుకంటే.. ఇక్కడ ఉన్నది ధర్మాన ప్రసాదరావు మాత్రమే. పక్కనే ఉన్న ఆమదాలవలస, ఎచ్చెర్ల మాదిరిగానో, జిల్లా బోర్డర్‌లో ఉన్న ఇచ్ఛాపురం మాదిరిగానో మరో నాయకత్వం వైకాపాకు లేదు. ఇక్కడ ఎవరు చేసినా ధర్మాన కోసమే చేయాలి. ఎవరు ముసుగేసి పడుకున్నా ధర్మాన శైలి మీద అలిగే పడుకోవాలి.. తప్ప ధర్మానకు ధీటుగా పని చేశామని చెప్పే నాయకత్వం లేదు. అంతే ఒకే గొడుగు కింద ఉన్నప్పుడు నాన్నగారి పిలుపు మేరకు విజయవంతం చేసిన అని నొక్కి వక్కాణించడం చూస్తుంటే చిన్నీ అభద్రతతో ఉన్నారని తెలుస్తుంది. రాజకీయంగా అభద్రతా భావంతో ఉండటంలో తప్పులేదు. కానీ ఇలా ప్రజాక్షేత్రంలోకి రాకుండా నా పల్లకీ మోయండి బోయిల్లారా.. అంటే రాజకీయాలు ఇప్పుడలా లేవు. ఈరోజు కాకపోతే రేపైనా వైకాపా జిల్లా పగ్గాలు ధర్మాన చేతికొస్తాయి. గట్టిగా మాట్లాడితే ఇప్పటికే ఉన్నట్టు లెక్క. ఎందుకంటే.. కృష్ణదాస్, ధర్మాన ఇప్పుడు వేరు కాదు. ఎప్పుడూ కాదు. కాకపోతే తన కొడుకు కృష్ణచైతన్యకు టిక్కెటివ్వాలని దాస్ ఓపెన్‌గానే అడుగుతున్నారంటే అందుకు కారణం కృష్ణచైతన్య యాక్టివిటీనే. ధర్మాన ప్రసాదరావుకు ఆయన కుమారుడు కూడా ఎమ్మెల్యే కావాలని కోరిక ఉన్నా బహిరంగంగా ప్రకటించకపోవడానికి కారణం చిన్నీ అధికారంలో లేనప్పుడు ఇనాక్టివ్‌గా స్టేట్‌మెంట్లకు పరిమితం కావడమే. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ధర్మాన ప్రసాదరావు చేతిలో జిల్లాను పెడితే జగన్మోహన్‌రెడ్డిని ఒప్పించి టిక్కెట్ అడిగితే రామ్మనోహర్ నాయుడు ఏం చేశాడన్న ప్రశ్న తలెత్తితే ఏం చెప్పాలి? ధర్మాన కొడుకుగా ఉండటం ఒక్కటే ఎమ్మెల్యే కావడానికి క్వాలిఫికేషన్ కాదు. నాయకుడిగా ముందుండాలి.. ముందు తరాల కోసం ఉండాలి.. అన్నింటికీ మించి నేనున్నానని భరోసా కలిగించగలగాలి.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.